## కమ్యూనిటీ పోలీసింగ్‌కు సహకరించాలి



**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఎస్సై బోయిని సౌజన్య కోరారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఎస్సై బోయిని సౌజన్య పాల్గొని మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తగు జాగ్రత్తలు పాటిస్తూ రోజువారీ పనులు చేసుకోవాలని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, విద్యుత్ సంబంధిత గోడలు లేదా ఇతర పరికరాలను ప్రత్యక్షంగా ముట్టుకోరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అంజయ్య, కానిస్టేబుల్ సునీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైబర్ మోసగాళ్ల నుంచి రూ.5,489 కోట్ల స్వాధీనం

- 12 లక్షలకుపైగా మొబైల్స్ బ్లాక్
- 13 లక్షలకుపైగా బ్యాంకు అకౌంట్ల సీజ్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

సైబర్ మోసగాళ్ల నుండి ఇప్పటి వరకు రూ.5489 కోట్లను రికవరీ చేసినట్లు కేంద్ర హోంమం త్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. ఆ సొమ్మును బాధితులకు రీఫండ్ చేసేలా నిబంధనలను సులభతరం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన కేసుల్లో సైబర్ కమాండోల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్ లోని తన కార్యాలయంలో సైబర్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ డివిజన్ కార్యకలాపాలను కేంద్ర మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ప్రాధాన్యతను వివరించారు. సైబర్ నేరాలపై పోరాటంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కల్పించే ప్రధాన కేంద్రంగా ఐ4సీ పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సైబర్ మోసాల నియంత్రణలో భాగంగా తీసుకున్న చర్యలను కేంద్ర మంత్రికి సంబంధిత శాఖ అధికారులు వివరించారు. సైబర్ మోసాల బాధితుల నుండి ఇప్పటి వరకు రూ.5489 కోట్లను రికవరీ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు 12 లక్షలకుపైగా సిమ్ము/మొబైల్ హ్యాండ్సెట్లను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. అట్లాగే రూ.4631 కోట్లు విలువైన మోసపూరిత లావాదేవీలను అడ్డుకోవడం జరిగిందని, అందులో భాగంగా 13.3 లక్షల మ్యూల్ అకౌంట్లను (సైబర్ మోసాల్లో డబ్బు తరలించడానికి వాడే బ్యాంకు ఖాతాలు) ఫ్రీజ్ చేసినట్లు వివరించారు.



## జిల్లాలో భారీ వర్షా లు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరిక

**శెనార్తి మీడియా, సిద్దిపేట:**

జిల్లాలో రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సిద్దిపేట కలెక్టర్ కే. హైమావతి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో వర్గల్, మర్కుక్, జగదేవపూర్, గజ్వేల్, కుకునూరుపల్లి, కొమురవెల్లి, మిరుదొడ్డి మండలాల్లో వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. ఐఎండీ అంచనా ప్రకారం వచ్చే 24 గంటల్లో 6 నుంచి 22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా గజ్వేల్ డివిజన్‌లో వర్ష ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావొద్దని, లో లెవెల్ బ్రిడ్జిలు, కాజ్వేలు, ప్రమాదకర ప్రాంతాలు వద్ద ప్రయాణించరాదని సూచించారు. పశువులను వాగులు, చెరువుల వద్దకు మేపడానికి తీసుకెళ్లరాదు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదు, వాటి దగ్గర నిలబడరాదు. పాడుబడ్డ ఇండ్ల దగ్గరికి వెళ్లరాదు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్ 08457-230000 ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని ఈనెల 19న జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- సామాజిక సమానత్వానికి కృషి చేసిన మహానాయకుడు
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**



సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాపన్న కులవ్యవస్థ, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని, సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన జీవన విధానం, ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పాపన్న మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా ప్రజలలో పోరాట పటిమకు దిశానిర్దేశం చేశారని అన్నారు. అట్టడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసి కోటలు నిర్మించారని, సాగునీటి కోసం ఉద్యమం నడిపారని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా బిసి సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ళ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల స్వామి గౌడ్, పట్టణ అధ్యక్షులు దూలం అంజయ్య, రాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్, బుర్ర ముత్తయ్యా గౌడ్, మార్క రాజు గౌడ్, పురుషోత్తం, ఆశిష్ గౌడ్, సాగర్ గౌడ్, అనిల్ గౌడ్, గనగోని సత్యం, బండారి గాయిత్రి, శరణ్య, ఉయ్యాల శ్రీనివాస్, బైరీ రాజు గౌడ్, బిసి సంఘం నాయకులు శ్రీధర్, నేరుమట్ల మల్లేశం పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముక్కిస తిరుపతి రెడ్డి సోదరుడు ముక్కిస బాపిరెడ్డి ఇటీవల మృతిచెందారు. ఆయన కుమారుడు వంశీకృష్ణను, కుటుంబ సభ్యులను మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముక్కిస తిరుపతి రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు ముక్కిస తిరుపతి రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎల్. శేఖర్ బాబు, నాయకులు లింగాల అర్జున్, ముక్కిస అంజిరెడ్డి, పల్లె రాజు, పల్లె బాల్ రెడ్డి, తాడూరి రామ్ రెడ్డి, చిలువేరి బాల్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రత్నాకర్, యేసు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించడంలో

## ప్రభుత్వాలు విఫలం

- బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు బిగుళ్ల మోహన్

**శెనార్తి మీడియా, బెజ్జంకి :**

రైతులు సాగు చేసిన పంటలకు కనీసం యూరియా అందించలేని దౌర్భాగ్యం కాంగ్రెస్ పాలనలో నెలకొన్నదని బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు బిగుళ్ల మోహన్ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రైతు కూడా ఎరువుల కోసం రోడ్డెక్కలేదని గుర్తు చేశారు. కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని కాంక్షించగా, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. మండల కేంద్రాల్లో రోజూ రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని, పంటలకు సరిపడే ఎరువులు అందించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని మండిపడ్డారు. రైతుల కష్టాలు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "రైతు ఏడ్చిన రాజ్యం ఉండదు, ఎద్దు ఏడ్చిన ఎవుసం ఉండదు" అనే నానుడిని గతంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చెప్పినట్లుగానే, రైతులను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఆ నానుడిని నిజం చేస్తున్నాయని బిగుళ్ల మోహన్ వ్యాఖ్యానించారు. రైతుల ఉసురు తప్పకుండా ప్రభుత్వాలకు తగులుతుందని హెచ్చరించారు.

## కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- 52వ డివిజన్ కార్పొరేటర్‌కు రాజాజీనగర్ కాలనీ కమిటీ సభ్యుల వినతి



**శెనార్తి మీడియా, హన్మకొండ :**

హన్మకొండ రాజాజీనగర్ కాలనీ కమిటీ సభ్యులు ఆదివారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 52వ డివిజన్ కార్పొరేటర్, బిజెపి పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమం కాలనీ అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పనులు, జరగబోయే పనులపై వివరాలు తెలియజేశారు. కాలనీలో రోడ్ల సుందరీకరణ, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం, బతుకమ్మ ఆడుటకు స్థలం సేకరణ వంటి అంశాలపై కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేయగా, సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటానని స్వాతి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు కార్పొరేటర్ సానుకూల స్పందనపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రావు, రాంరెడ్డి, సురేందర్ రెడ్డి, జగదీశ్వర్, జనార్దన్ రెడ్డి, రవీందర్, రాంబాబు, బాలరాజు, రాజేందర్ రెడ్డి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, దేవేందర్ కుమార్, శ్రీనివాస్ రావు, రమేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ రాష్ట్ర నాయకులు



**శెనార్తి మీడియా, తిమ్మాపూర్ :**

నేదునూరు సర్పంచ్ వడ్లూరి శంకర్ తమ్ముడు హరీష్–శ్రీహిత వివాహ వేడుకలో బీజేపీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్య క్షుడు సొల్లు అజయ్ వర్మ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వ దించారు. ఈ సందర్భంగా 10టీవీ రిపోర్టర్ అనిల్, శెనార్తి మీడి యా దినపత్రిక రిపోర్టర్ తుమ్మ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభకు ప్రశంస

**గుడ్ టచ్–బ్యాడ్ టచ్ ప్రాజెక్టుపై కలెక్టర్ పమేలా సత్పతి సూచనలు**

**శెనార్తి మీడియా,చిగురుమామిడి:**

మండలంలోని ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థినులు రూపొందించిన గుడ్ టచ్–బ్యాడ్ టచ్ రెస్పాండింగ్ డాల్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రశంసించారు. సోమవారం కలెక్టర్ ముందు విద్యార్థినులు ఈ ప్రాజెక్టును ప్రదర్శించారు. ప్రాజెక్టులో మరిన్ని మార్పులు చేయాల్సిందిగా కలెక్టర్ సూచనలు చేశారు. వాయిస్ రికార్డింగ్ ద్వారా గుడ్ టచ్–బ్యాడ్ టచ్ అంశాలకు సంబంధించిన విషయాలన్నింటినీ నిక్షిప్తం చేయాలని, బ్యాడ్ టచ్ చేసిన వారి వివరాలను నమోదు చేసుకునే విధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. పాఠశాలలోని బాలలందరికీ గుడ్ టచ్–బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ ప్రాజెక్టును విద్యార్థిను లు జె.వైష్ణవి, పి.అను శ్రీ రూపొందిం చారు. వారికి మార్గదర్శకులుగా ఎన్. కొండల్ రెడ్డి (పీజీటీ), వి. ముక్తి ప్రసాద్ (పీజీటీ) సహకరించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ తో పాటు గైడ్ టీచర్ల కృషిని కూడా కలెక్టర్ ప్రశంసించారు.

## ప్రజావాణికి 265 దరఖాస్తులు

**శెనార్తి మీడియా, కరీంనగర్**



కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 265 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించారు. ప్రజల నుండి నేరుగా దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, వాటిని సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆన్లైన్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు, రెవిన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్ పాల్గొన్నారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాల పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశిం చారు. వినియోగంలో లేని భవనాలను అవసరమైన శాఖలకు కేటాయిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంపై విస్తృ తంగా అవగాహన కల్పించాలని మెప్మా, డీఆర్డీఓ అధికారులను కలెక్టర్ సూచిం చారు. ఎంపీడీవోలు పంచాయతీ కార్యద ర్శుల సహకారంతో ప్రాథమిక వ్యవసా య పరపతి సంఘాల ఆధ్వర్యంలోని ఎరువుల విక్రయం కేంద్రాలను పర్య వేక్షించాలని ఆదేశించారు



## ఝాన్సీ రాజేందర్ రెడ్డిని కలిసిన నాయకులు

**శెనార్తి మీడియా, పాలకుర్తి :**

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల నాయకుడు దావెర అనిల్‌కుమార్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గనుపాక ప్రదీప్, అప్పిరెడ్డిపల్లి గ్రామ యూత్ అధ్యక్షుడు పులిగిల్ల అఖిల్ పాల్గొన్నారు.

## శిశుగృహం నుంచి యుఎస్ఏ దంపతులకు శిశువు దత్తత




**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ శిశుగృహంలో పెరుగుతున్న మూడు సంవత్సరాల పాపను యుఎస్ ఏకు చెందిన దంపతులకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా దత్తత ఇచ్చారు. ఈ దంపతులకు ఇదివరకు బాబు జన్మించగా, ఆడ శిశువు దత్తత కోసం నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు అవసరమైన పరిశీలన చేసి, శిశువును చట్టబద్ధంగా దత్తత ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను అనుసరించాలని సూచించారు. ఇందుకోసం జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలో గల జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డిసిపిఓ పర్వీన్ పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవం విజయవంతం

- డీఐఓ డాక్టర్ సజిదా అతహరి

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో లక్ష్యానికి దగ్గరగా మాత్రలు వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 11న నులిపురుగుల నివారణ కార్యక్రమంలో వివిధ కారణాలతో మాత్ర వేసుకోని 17,384 మంది పిల్లలకు సోమవారం మాత్రలు వేసినట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సజిదా అతహరి వివరించారు. జిల్లా వ్యాప్తంగా 2,59,365 మంది పిల్లలకు మాత్రలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 2,58,593 మందికి మాత్రలు వేసి 99.7 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. తిరిగి మాత్ర వేసే రోజు (మాప్ అప్ డే) ఈ నెల 18న నిర్వహించనున్నట్లు తెలిపారు.